సాక్షి
వికారాబాద్
బుధవారం ‌। 11 ‌। జనవరి ‌। 2023



అర్ధాకలి చదువులు

నెల రోజులుగా కొనసాగుతున్న ప్రత్యేక తరగతులను టెన్త్ విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తూ వింటున్నారు. 8లో▸



పార్టీని బలోపేతం చేద్దాం

అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాల విధానాలను ఎండగట్టాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



కష్టాల్లో పాడి కర్షకులు

'పాడి ఉన్న ఇంట సిరుల పంట' అని పెద్దలు చెప్పిన మాట ఎలా ఉన్నా.. నేడు అది రైతుల ఇంట కష్టాలు తెచ్చిపెడుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

బాధితులకు అండగా నిలుస్తాం



మోమిన్‌పేటలో చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న సునీతారెడ్డి

మోమిన్‌పేట: రోడ్డు విస్తరణలో భాగంగా డబ్బాలు కోల్పోయిన వారికి అండగా నిలుస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. మంగళవారం ఆమెను కలిసిన బాధితులు తమ సమస్యను మొరపెట్టుకున్నారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ మండల పరిషత్ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అవసరమైన నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన వారికి ప్రాధాన్యం ఇచ్చి, దుకాణాలు కేటాయిస్తామని స్పష్టంచేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు సమద్, ఆసిఫ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

నంబర్ ప్లేట్లపై స్పెషల్ డ్రైవ్



కోటిరెడ్డి, ఎస్పీ

అనంతగిరి: నేరాలు చేసి తప్పించుకునేందుకు కొంతమంది, చలాన్‌ల నుంచి తప్పించుకునేందుకు మరికొంత మంది నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేస్తున్నారని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. నంబర్ ప్లేట్లు లేని, ట్యాంపరింగ్ చేసిన వాహనాలను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నేరస్తులు, అక్రమ కార్యకలాపాలు చేసేవారు పోలీసుల నుంచి తప్పించుకొని తిరిగే నేరగాళ్లు నంబర్ ప్లేట్ లేని వెహికిల్స్ వినియోగిస్తున్నారని స్పష్టంచేశారు. నంబర్ ప్లేట్లు కనబడకుండా మాస్కులు పెట్టడం, నంబర్ మార్చడం, ఒక నంబర్‌ను తొలగించడం, ప్లేట్లను వంచడం చట్టరీత్యా నేరమని తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో సిబ్బంది

కొడంగల్ రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి ఎస్‌ఎంసీ చైర్మన్ పిట్ల ఆంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనిస్తాం



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: నిరుపేద కుటుంబాలకు చేయూతనివ్వడంలో బీఎంఆర్ ఫౌండేషన్ ముందుంటుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిగి నియోజకవర్గ పరిధిలోని కుల్కచర్ల, దోమ, పరిగి, పూడురు, చౌడాపూర్, మహ్మదాబాద్, గండీడ్ మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం నుంచి స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్లు ప్రకటించారు. ఇటీవల మృతిచెందిన కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘం సభ్యుడు బర్కపోచయ్య కుటుంబ సభ్యులకు రూ.9 వేల తక్షణ సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు రాంలాల్, నాయకులు మొగులయ్య, చంద్రయ్య, జోగు వెంకటయ్య, సాయన్న, జనార్దన్‌రెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ దందా!

- వ్యవసాయ పొలాల నుంచి యథేచ్ఛగా మట్టి, మొరం తరలింపు
- జోరుగా కృత్రిమ ఇసుక తయారీ
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీసు అధికారులు



మోత్కూర్‌లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

దోమ: గ్రామాల్లో అక్రమంగా మట్టి, మొరం తరలింపు, కృత్రిమ ఇసుక తయారీ దందా యథేచ్ఛగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే రైతుల పొలాల్లో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మోత్కూర్, బుద్లాపూర్, గంజిపల్లి, బడేంపల్లి, గొట్లచెల్కతండా, లింగన్‌పల్లి గ్రామాల సమీపంలో కొందరు ఇసుక వ్యాపారులు రైతుల పొలాల్లోని మట్టిని తవ్వుతూ ట్రాక్టర్లలో తరలించి ఒక్కచోట డంప్ చేస్తున్నారు. మట్టిని ఫిల్టర్ చేసి ఇసుకను విక్రయిస్తున్నారు. మండల వ్యాప్తంగా కృత్రిమ ఇసుక దందాకు అడ్డుఅదుపూ లేకుండాపోతోంది. కొందరు వ్యాపారులు పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై ఈ వ్యవహారం నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో గత ఆదివారం కొందరు వ్యాపారులు మట్టి తవ్వకాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పీఎస్‌కు తరలించారు.

శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో రాత్రి వేళ తవ్వకాలు చేపడుతున్న అక్రమార్కులు కేసులు నమోదవుతున్నా వెనకాడటం లేదు. గ్రామాల సమీపంలోని వాగుల వద్ద పేరుకుపోయిన ఇసుకను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఫిల్టర్ ఇసుకను వాడిన నిర్మాణాలు కొద్ది రోజుల్లోనే బీటలు వస్తున్నాయని నిర్మాణదారులు చెబుతున్నారు.

నిర్మాణాలు పెరగడంతోనే..

గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఏ పని కదలాలన్నా ఇసుక తప్పనిసరి. దీంతో కొంతమంది అక్రమార్కులు ఫిల్టర్ ఇసుక తయారు చేసి విక్రయిస్తున్నారు. నిత్యం ఏదో ఓ గ్రామానికి తీసుకెళ్లి నిర్మాణాలు జరుగుతున్న చోట డంప్ చేస్తున్నారు. కొంత మంది రాజకీయ నేతల అండదండలతోనే ఈ వ్యవహారం సాగుతోందనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై ఉన్నతాధికారులు దృష్టిసారించి, కృత్రిమ ఇసుక తయారీని అడ్డుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం



అక్రమంగా ఇసుక తరలించినా, మట్టిని ఒకచోట డంప్ చేసినా కేసులు నమోదు చేస్తాం. ఇటీవల మోత్కూర్ నుంచి ఇసుక తరలిస్తున్నారనే సమాచారం అందుకుని సిబ్బందిని పంపించాం. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశాం. గ్రామాల సమీపంలో ఉన్న వాగుల నుంచి ఇసుకను తరలించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– విశ్వజాన్, ఎస్‌ఐ, దోమ

వాహనాలను సీజ్ చేస్తాం



అక్రమంగా ఇసుక, మట్టిని తరలించే వాహనాలను సీజ్ చేస్తాం. సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం. కృత్రిమ ఇసుక తయారీపై ప్రత్యేక నిఘా పెడుతాం. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు. ఏ వ్యాపారానికైనా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కృత్రిమ ఇసుక తయారీని అరికట్టేందుకు స్పెషల్ టీంలను ఏర్పాటు చేస్తాం.

– షాహెదాబేగం, తహసీల్దార్, దోమ



కేంద్ర రైల్వే మంత్రికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య(ఫైల్)

ట్రాక్ దాటేదెలా?

- 16 కిలోమీటర్ల పొడవునా రైల్వే ట్రాక్ సమస్యలు
- కేవలం ఒక్క చోట మాత్రమే రాకపోకలకు వీలు
- ఇబ్బందుల్లో నవాబుపేట మండలవాసులు

నవాబుపేట: నవాబుపేట మండల ప్రజల పరిస్థితి ముందు నుయ్యి.. వెనక గొయ్యి అనే చందంగా మారింది. మండలం మీదుగా చించల్‌పేట్ నుంచి ముబారక్‌పూర్ వరకు సుమారు 25 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్ ఉంది. దీనికి అతి సమీపం నుంచే 16 కిలోమీటర్ల మేర మూసీ ప్రవహిస్తుంది. ఆయా గ్రామాల ప్రజలు ట్రాక్ దాటేందుకు కేవలం గొల్లగూడ, గేట్‌వనంపల్లి వద్ద మాత్రమే రైల్వే గేట్లున్నాయి. అలాగే మూసీ నదిని దాటేందుకు గంగ్యాడ వద్ద బ్రిడ్జి ఉండగా ఇటీవల చించల్‌పేట, ముబారక్‌పూర్ వద్ద మరో రెండు వంతెనల పనులు చేపట్టారు. మండలంలో 32 జీపీలు, రెండు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. మూసీ నదికి, రైల్వేట్రాక్‌కు ఇవతల ఏడు గ్రామాలు ఉంటాయి. మండల కేంద్రంతో పాటు మిగిలిన గ్రామాలకు వెళ్లేందుకు గొల్లగూడ రైల్వే గేటు, గంగ్యాడ వద్ద ఉన్న మూసీ నది వంతెనలపై రాకపోకలు సాగించాలి.

చిన్న వంతెనలతో ఇబ్బందులు

ముబారక్‌పూర్, ఎల్లకొండ, గొల్లగూడ, లింగంపల్లి, నారెగూడ, పులుమామిడి, అక్నాపూర్, చిట్టిగిద్ద, చిట్టిగిద్ద రైల్వేస్టేషన్, చించల్‌పేట గ్రామాల వద్ద రాకపోకలకు గతంలో ఏర్పాటు చేసిన రైల్వే వంతెనలు వాహనాల రాకపోకలకు వీల్లేకుండా ఉన్నాయి. కేవలం ఆటోలు, చిన్న వాహనాలు మాత్రమే ఈ మార్గంలో వెళ్తాయి. దీంతో ఏ అవసరం ఉన్నా గొల్లగూడ రైల్వే స్టేషన్ గేటు నుంచి వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రైల్వే మంత్రికి విన్నవించినా..

రైలు ప్రమాదాలను నివారించే కవచ్ టెక్నాలజీని పరిశీలించేందుకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల పులుమామిడికి వచ్చారు. ఈ సమయంలో మంత్రిని కలిసిన స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు రైల్వే ట్రాక్, బ్రిడ్జిల సమస్యను ఆయనకు వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినా ఈరోజు వరకూ ఎలాంటి పురోగతి లేదు.

పాఠశాల.. మరింత వెలిగేలా..



రామచంద్రాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

- పీఎంశ్రీ పథకానికి కేంద్రం శ్రీకారం
- రంగారెడ్డిలో 380 స్కూళ్లకు అర్హత
- పూర్తయిన దరఖాస్తు ప్రక్రియ
- మండలానికి రెండు చొప్పున ఎంపిక
- సెలెక్టయితే మారనున్న రూపురేఖలు

కొందుర్గు: సర్కారు బడులను బలోపేతం చేసి గ్రామీణ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయిలో సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం 2021–22 యూడైస్ ఆధారంగా సొంత భవనం, ఫైర్ సేఫ్టీ పరికరాలు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ అధికంగా ఉండటం, బాలురు, బాలికలు వేర్వేరు టాయ్‌లెట్స్ కలిగి ఉండటం, తాగునీటి సౌకర్యం, హ్యాండ్‌వాష్ సదుపాయం, విద్యుత్ సౌకర్యం, గ్రంథాలయం, ఆటవస్తువులు, ఉపాధ్యాయుల గుర్తింపు కార్డులు కలిగి ఉన్న పాఠశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. 2022 డిసెంబర్ 31తో దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. జిల్లా నుంచి ఈ పథకానికి 380 పాఠశాలలు అర్హత సాధించడంతో అన్ని పాఠశాలల నుంచి దరఖాస్తులు అందినట్లు జిల్లా అధికారులు తెలిపారు.

ఎంపికైతే ఏటా రూ.40 లక్షలు

జిల్లాలో మొత్తం 27 మండలాలలకు సంబంధించి 881 ప్రాథమిక, 180 ప్రాథమికోన్నత, 247 జిల్లా పరిషత్, 7 మోడల్, 20 కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. ఎయిడెడ్, ఇతర పాఠశాలలు కలిపి మరో 85 ఉన్నాయి. దాదాపు 1.80 లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. పీఎంశ్రీ పథకానికి దరఖాస్తు చేసుకున్న 380 పాఠశాలల నుంచి మండలానికి రెండు చొప్పున 54 స్కూళ్లను ఎంపిక చేస్తారు. ఎంపికైన పాఠశాలకు రాబోయే విద్యాసంవత్సరం (2023–24) నుంచి ఏటా రూ.40 లక్షల లెక్కన ఐదేళ్లకు రూ.2 కోట్లు మంజూరు చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. ఈ పథకానికి ఏ పాఠశాలలు ఎంపికవుతాయో వేచి చూడాలి.

బాలికల భవిష్యత్తుకు పెద్దపీట

- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి
- చంద్రాయన్‌పల్లిలో కేజీబీవీ నూతన భవనం ప్రారంభం



చంద్రాయన్‌పల్లిలో కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి తదితరులు

మోమిన్‌పేట: బాలికల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లిలో రూ.2.05 కోట్లతో నిర్మించిన కేజీబీవీ నూతన భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డితో కలిసి మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాలికల విద్యాభివృద్ధి కోసం గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కేజీబీవీల్లో ఇంటర్ తరగతులు ప్రవేశపెట్టామని స్పష్టంచేశారు. జిల్లాలోని కస్తూర్బాగాంధీ స్కూళ్ల మరమ్మతుల కోసం రూ.4 కోట్లతో అంచనాలు సిద్ధం చేశామని వివరించారు. బాలికల చదువుపై దృష్టిపెట్టి ప్రైవేటుకు దీటుగా ఇంజనీరింగ్, మెడికల్ సీట్లు సాధించాలని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన సిబ్బంది ఉంటారన్నారు. సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించేందుకు మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఈఓ రేణుకాదేవి, సర్పంచు అంజయ్య, ఎంపీపీ వసంత వెంకట్, వైస్ ఎంపీపీ మానస, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ శైలజారెడ్డి, బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశమంతటా బీఆర్‌ఎస్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

బీఆర్‌ఎస్ త్వరలోనే దేశమంతటా విస్తరిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మండల కేంద్రంలోని బీకేఆర్ గార్డెన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ మరింత కృషి చేయాలన్నారు. యువతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతీ వంద మందికి ఒకరిని ఇన్‌చార్జ్‌గా నియమిస్తామని చెప్పారు. గ్రామ, మండల స్థాయిలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ సర్కార్ అని వెల్లడించారు. అరవై ఏళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్‌ను ప్రజలు ఏనాడో తిరస్కరించారన్నారు. బీఆర్‌ఎస్ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు రూ.2 లక్షల బీమా సౌకర్యాం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీపీ వసంత, వైస్ ఎంపీపీ మానస పాల్గొన్నారు.



పోచమ్మ జాతరలో గ్రామస్తులు



పెద్దేములలో బోనాల ఊరేగింపు



నృత్యం చేస్తున్న జోగిని నిషక్రాంతి



పెద్దేములలో పూజలందుకున్న ఊరడమ్మ

వైభవంగా బోనాలు

దప్పుల మోత.. పోతరాజుల ఆట.. జోగినుల నృత్యాలు.. యువకుల కేరింతల నడుమ అమ్మవారి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్దేముల్, చెంగోల్‌లో బోనాల పండుగ అంబరాన్నంటింది. భారీగా తరలివచ్చిన మహిళలు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. చెంగోల్‌లో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ మల్లీశ్వరిగౌడ్, ఎంపీటీసీ రత్నమాల, ఉప సర్పంచు లక్ష్మణ్, గ్రామస్తులు శేఖర్‌గౌడ్, వేణుగౌడ్, రాములు పాల్గొన్నారు.

– తాండూరు రూరల్/ పెద్దేముల్

క్లుప్తంగా

నియంతృత్వ పోకడలో రాష్ట్ర ప్రభుత్వం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వ విధానాలతో వ్యవహరిస్తున్నదని రిపబ్లికన్‌ పార్టీ ఆఫ్‌ ఇండియా రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామన్నమాదిగ అన్నారు. మంగళవారం కుల్కచర్ల తహసీల్దార్‌ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఇప్పటికీ ఇల్లు లేని నిరుపేదలు ఎంతో మంది ఉన్నారని, వారికి న్యాయం చేయాలని అన్నారు. అంబేడ్కర్‌ కలలుగన్న రాజ్యం రావాలని, బహుజన ప్రజలకు రాజ్యాధికారం దక్కాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


దోమలో యూటీఎఫ్‌ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఆయన టీఎస్‌యూటీఎఫ్‌ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నాగిరెడ్డి, ఎంపీటీసీ బంగ్ల అనితగౌడ్‌, టీఎస్‌యూటీఎఫ్‌ జిల్లా కార్యదర్శి రాములు, మండల అధ్యక్షుడు రమేశ్‌, ప్రధాన కార్యదర్శి సక్రియా, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాప్రదర్శన


సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సాంస్కృతిక సారథి టీం జిల్లా కో–ఆర్డీ నేటర్‌ మోత్కుపల్లి సంజీవ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపైన కలెక్టర్‌ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ(డీపీఆర్‌ఓ) ఆధ్వర్యంలో కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సంజీవ, భిక్షపతి, శ్రీనివాస్‌, వెంకట్‌, రాములు, కిష్టయ్య, అధ్వర్‌ అర్చన, సంధ్య, అనుభాయి సైదులమ్మలు కళాప్రదర్శన చేశారు.

‘రైతు రుణమాఫీ చేయకుంటే ఆందోళనే’

కద్దాల్‌: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయకుంటే కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రైతులకు లక్షలోపు పంట రుణాలను ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని, నాలుగేళ్లు పూర్తయినా ఇంత వరకు అమలు కాలేదని ఆరోపించారు.

రోడ్లపై సంత.. వీడని చింత

బొంరాస్‌పేట: మండల పరిధిలోని తుంకిమెట్ల, బొంరాస్‌పేట వారాంతపు సంతలు భయాందోళన కలిగిస్తున్నాయి. జాతీయ రహదారి, మండల కేంద్రం రోడ్లపై సంతలు కొనసాగుతుండటంతో ప్రజలు, వ్యాపారస్తులు ప్రతివారం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మూడు నెలలుగా తుంకిమెట్ల సంత నాందార్‌పూర్‌ రోడ్డుకు మళ్లించినా ప్రమాదాల భయాందోళన తప్పడం లేదు. ప్రతి ఆదివారం తుంకిమెట్లలో బీజాపూర్‌–హైదరాబాద్‌ జాతీయ రహదారిపై ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వారాంతపు సంత కొనసాగుతుంది. సంత ఇంతకింతకూ పెరుగుతూ వస్తోంది. ఉద్యోగులు, వ్యాపారస్తులకు సెలవుదినం కావడంతో మరింత రద్దీ పెరుగుతోంది. వ్యాపారాలు సైతం అదే తరహాలో పెరుగుతున్నాయి. ఇటు కొడంగల్‌ వైపు, అటు నాందార్‌పూర్‌ వైపు సంత విస్తరిస్తోంది. దీంతో సంతలో ట్రాఫిక్‌ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే మండల కేంద్రంలోనూ ప్రధాన రహదారి భూలక్ష్మి చౌరస్తా నుంచి మీది హనుమాండ్ల వరకు సంత జరుగుతుంది. వందల సంఖ్యలో వ్యాపారులు ఉండటం రద్దీగా ఉంటూ రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సంత స్థలాలను మరో చోటికి మార్చి ట్రాఫిక్‌ ఇబ్బందులు తొలగించేందుకు అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.


రోడ్డుపై కొనసాగుతున్న తుంకిమెట్ల సంత

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

దోమ: గ్రామస్తులు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం బొంపల్లి గ్రామ సమీపంలో మైసమ్మ దేవత పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ప్రజలందరూ భక్తి భావాలను పెంపొందించుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు బాల్‌రాజ్‌, రాములు ముదిరాజ్‌, మహేశ్‌, మల్లేశ్‌, శ్రీనివాస్‌, భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.


టెన్త్‌ విద్యార్థులకు స్లిప్‌ టెస్టు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

అర్ధాకలి చదువులు

- ప్రత్యేక తరగతుల వేళ అందని అల్పాహారం
- దృష్టి సారించలేకపోతున్న విద్యార్థులు
- దాతలు స్పందించాలంటున్న తల్లిదండ్రులు

దౌల్తాబాద్‌: పదిలో విద్యార్థులు మంచి గ్రేడ్‌ సాధించాలని విద్యాశాఖ అధికారులు గత నెల ఒకటి నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. తరచూ పరీక్షలు నిర్వహిస్తూ వెనుకబడిన పిల్లలపై శ్రద్ధ చూపుతున్నారు. ఇదే సమయంలో విద్యార్థులు అర్ధాకలితో అవస్థలు పడుతున్నారు. ఈ ప్రభావం చదువుపై పడుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఆకలి కారణంగా చదువులపై దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. దీంతో స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేద విద్యార్థులే ఎక్కువ...

మండలంలో ఏడు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 480 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వీరిలో ఎక్కువ మంది పేద విద్యార్థులే ఉండడంతో ఉదయం ప్రత్యేక తరగతులకు ఖాళీ కడుపులతో వచ్చి మధ్యాహ్నం భోజనం వరకు ఆకలితో ఉండాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి జెడ్పీ పాఠశాలకు రావడానికి కనీసం రవాణా సదుపాయం కూడా లేకపోవడంతో చాలా మంది కాలినడకనే వస్తున్నారు. ఆకలితో పాటు అలసట కూడా వారిని మరింత ఇబ్బంది పెడుతోంది.

దాతలు ముందుకు వస్తేనే..

గత నెల ఒకటి నుంచి ఉదయం 8.45 నుంచి 9.30 వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అధిక శాతం పిల్లలు ఉదయం తినకుండానే సుమారు 5 కిలోమీటర్ల దూరం నుంచి పాఠశాలకు వస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో సరిపుచ్చుకోవాల్సి వస్తుంది. కరోనాకు ముందు కొన్ని పాఠశాలల్లో దాతల సాయంతో అల్పాహారం అందించారు. ఈ సారి దాతలు స్పందిస్తే విద్యార్థులకు అల్పాహారం లభించే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంటున్నారు. కొన్ని పాఠశాలల్లోని విద్యార్థులు ఒక్కపూటనే తరగతులకు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం స్పందించి ప్రత్యేక తరగతుల నిర్వహణకు అదనపు నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

అలసటతో ఇంటికి..



మా గ్రామం అంతారం నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలంపేట ఉన్నత పాఠశాలకు రావాలంటే బస్సులు లేవు. దీంతో రోజూ నడుచుకుంటూ వచ్చి వెళ్తున్నాం. ఇంటి నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరుతాం. మధ్యాహ్న భోజనం వరకు ఆకలితో అలమటించాల్సి వస్తుంది. దాతలు స్పందించి అల్పాహారం అందించేలా చర్యలు తీసుకోవాలి.

– బిందు, విద్యార్థిని, అంతారం

దాతలు స్పందిస్తే మేలు



టెన్త్‌ విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు స్వచ్ఛంద, దాతలు స్పందిస్తే మేలు జరుగుతుంది. అల్పాహారం అందించే విషయమై ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, దాతలకు మరోమారు అవగాహన కల్పిస్తాం. పది ప్రత్యేక తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్‌

కలిసికట్టుగా పార్టీని బలోపేతం చేద్దాం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడదాం
- వచ్చేది కాంగ్రెస్‌ ప్రభుత్వమే
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: అబద్ధపు ప్రచారాలతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మీర్జాపూర్‌ని వ్యవసాయ క్షేత్రంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. పేదల జన్‌ధన్‌ ఖాతాల్లో 15లక్షలు వేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం 15 రూపాయలు కూడా వేయలేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. గ్రామాల్లో నేటికీ కాంగ్రెస్‌ చేపట్టిన అభివృద్ధి పనులే దర్శనమిస్తున్నాయని, టీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమిలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ నిధులను పక్కదారిపట్టిస్తున్నారని అన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టీఆర్‌ఎస్‌ చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యకర్తలు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని అన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన హాత్‌సే హాత్‌జోడో కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ఈ నెల 17 వరకు ప్రతి గ్రామంలో గ్రామకమిటీలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ సతీశ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌, పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు శకీల్‌,మాజీద్‌ఖాన్‌, నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

అన్ని హంగులతో ‘ఇంటిగ్రేటెడ్‌’


మార్కెట్‌ నిర్మాణం వివరాలను అడిగి తెలుసుకుంటున్న చైర్‌పర్సన్‌

వికారాబాద్‌ అర్బన్‌: అన్ని హంగులతో కూడిన మార్కెట్లను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగా వికారాబాద్‌కు సీఎం కేసీఆర్‌ రూ. 7.20కోట్లు మంజూరు చేశారని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల రమేశ్‌ తెలిపారు. బుధవారం రైతు బజారు వద్ద నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్‌ నిర్మాణం పూర్తయితే ఒకే చోట మాంసం, కూరగాయలతో పాటు, పండ్లు, పూలు కూడా ఇక్కడే లభిస్తాయన్నారు. పార్కింగ్‌ సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక కౌన్సిలర్‌ శ్రీదేవి, కౌన్సిలర్‌ మాలె గాయత్రి, మాజీ వైస్‌ చైర్మన్‌ రమేశ్‌ కుమార్‌, డీఈ రామ్‌ కిషన్‌, ఏఈ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

‘ప్రైవేటు’లో రిజర్వేషన్లు కల్పించాలి

ఆర్‌.కృష్ణయ్య డిమాండ్‌

గన్‌ఫౌండ్రీ: ప్రైవేటు విశ్వ విద్యాలయాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య డిమాండ్‌ చేశారు. మంగళవారం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ప్రైవేటు విశ్వ విద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ బషీర్‌బాగ్‌లోని విద్యాశాఖ మంత్రి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆర్‌.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలను విశ్వ విద్యాలయాలుగా మారుస్తూ రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతున్నాయని, పథకం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు రిజర్వేషన్లు అందకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి

అనంతగిరి: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి అన్నారు. ఈమేరకు మంగళవారం వికారాబాద్‌ మండల పరిషత్‌ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చంద్రకళారెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్పీ చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో 100 శాతం మరుగుదొడ్లు వినియోగించుకునేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నీటి పొదుపు, పారిశుద్ధ్యంపై సర్పంచులు చొరవ తీసుకోవాలన్నారు. పశువులకు బీమా చేసుకునేలా పశువైద్యాధికారులు రైతులకు తగిన అవగాహన కల్పించాలన్నారు. రైతులు ఆరుతడి పంటలు పండించేలా వ్యవసాయాధికారులు చూడాలన్నారు. అంతకుముందు పలు అంశాలపై సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా వైస్‌ ఎంపీపీ రాములు మాట్లాడుతూ మండల పరిధిలోని మదన్‌పల్లిలో పలువురు రైతులకు ప్రభుత్వం భూమి ఇచ్చిందని, ఆన్‌లైన్‌లో లేకపోవడంతో ఫారెస్టు వారు అడ్డంకి తెలుపుతున్నారని, దీంతో ధరణి పాసు పుస్తకాలు ఇవ్వడం లేదన్నారు. సాగు చేసే పొలాల్లో ఫారెస్టు అధికారులు మొక్కల కోసం గుంతలు తీశారన్నారు. రైతులు ఏమి చేయలేని నిస్సాహయ స్థితిలో ఉన్నారన్నారు. ఈ విషయమై జెడ్పీ చైర్‌పర్సన్‌ తహసీల్దార్‌ దృష్టికి తీసుకెళ్లారు. మదన్‌పల్లి రైతులకు కొత్త పాసు పుస్తకాలు, ఎర్రవల్లి–పులుమద్ది రోడ్డు విషయమై చర్చించారు. తహసీల్దార్‌ కార్యాలయానికి వచ్చిన ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలని సూచించారు. మండల సర్వసభ్య సమావేశానికి సంబంధిత అధికారులు తప్పకుండా వచ్చి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్‌ విజయ్‌కుమార్‌, జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎంపీడీఓ సత్తయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరత్నం, పలువురు మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి

సాగులో ‘సేంద్రియ’మేదీ?

- వరిలో ఆనాటి ఎరువులు కనుమరుగు
- విరివిగా రసాయనాల వినియోగం
- ఆర్థిక ఇబ్బందుల్లో రైతులు
- కలుషితమవుతున్న ఆహార పంటలు

బొంరాస్‌పేట : వరి సాగులో ‘సేంద్రియం’ కానరాడంలేదు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల కారణంగా సేంద్రియ పద్ధతులు కనుమరుగవుతున్నాయి. సంప్రదాయంగా సాగు చేసే రైతులు నూటికో కోటికో కనిపిస్తున్నారు. ముఖ్యంగా వరి సాగు పొలంలో కొన్ని సంవత్సరాల క్రితం కానుగ ఆకులు, ఎంపలి పొర్కను విరివిగా వాడేవారు. కాని ప్రస్తుతం రసాయన ఎరువుల తయారీ వాడకం ఎక్కువ కావడంతో మార్కెట్‌లోకి పోటీ పడి కంపెనీలు రసాయన ఎరువులను రైతులకు మరింత దగ్గర చేశాయి. ప్రస్తుతం సేంద్రియ ఎరువులు, పద్ధతులు తగ్గిపోయి రసాయనం వ్యవసాయంలో వ్యసనంగా మారింది. ఫలితంగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు.

కానుగ లాభాలు

వరి సాగుకు ముందు పొలంలో కానుగ కొమ్మలను నరికి ఎండిన తర్వాత నాటుకు ముందు తొక్కేవారు. ఇలా చేయడం వల్ల పంటకు నైట్రోజన్‌ విరివిగా లభిస్తోంది. ప్రస్తుతం దీని స్థానంలో యూరియాను వాడడం సహజమైపోయింది. కానుగ, ఎంపలి పొర్కల వల్ల పంట పొలం ఆరోగ్యవంతంగా ఉండి నేలలో మొక్కకు కావాల్సిన గాలిని, ఆర్గానిక్‌ పదార్థాలను వేళ్ల ద్వారా మొక్కకు సమకూరుస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎకరానికి ఒక యూరియా బస్తాను ప్రస్తుతం వాడుతుండగా కానుగ చెట్ల వాడకం వల్ల ఖర్చు తగ్గి పొలాలు సారవంతంగా ఉంటాయని చెబుతున్నారు. ఎకరా పొలంలో 30 మోపుల వరకు కానుగ సరిపోతుందని రైతులు చెబుతున్నారు.


వరి పంట సాగులో కానుగ కొమ్మలు వేసిన రైతులు

అవగాహన అవసరం

మండల పరిధిలోని బొంరాస్‌పేట పెద్ద చెరువు కింద 600 ఎకరాల్లో ప్రతియేటా వరి సాగు చేస్తుండగా పదెకరాల్లోకూడా కానుగ వాడకం లేకపోవడం శోచనీయం. కానుగ చెట్ల పెంపకం కూడా తగ్గిపోయిందని, కానుగ ఆవశ్యకత గురించి ఇప్పటి రైతులకు తెలిసినా వాడడం లేదని తెలుస్తోంది. ముందు తరాల రైతులకు సేంద్రియ పద్ధతులేమిటో తెలియజేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు వచ్చినా ఆశ్చర్యం లేదని వ్యవసాయానుభవజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. గతంలో మండలంలోని ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హంసాన్‌పల్లి, చౌదర్‌పల్లి, చెట్టుపల్లితండా, బురాన్‌పూర్‌, లింగన్‌పల్లి తదితర గ్రామాల్లో సేంద్రియ వ్యవసాయంపై ఉద్యమ రూపంలో కార్యక్రమాలు చేశారు. ప్రస్తుతం ఎన్‌పీఎం వంటి కార్యక్రమాలతో స్వచ్ఛంద సంస్థలు కొంత అక్కడక్కడా ప్రత్యేక కార్యక్రమాలు చేసి వదిలేస్తున్నారని వాటిని నిరంతరంగా పాటించేలా, అవగాహన కల్పించేలా బాధ్యత వహించాలంటున్నారు.

కానుగనే వాడుతా

మా తండ్రి కాలం నుంచి వరి సాగులో కానుగ మొక్కలనే వేయడం అలవాటు ఉంది. ఇప్పటికీ వరి పంట సాగులో కానుగను వాడడం మా కుటుంబానికి సంప్రదాయంగా మారింది. ఈ పొలంలో పండించిన వరి బియ్యం మరింత రుచికరంగా ఉంటుంది. శ్రమ అనుకోకుండా చేస్తే ఈ పద్ధతే మేలు.

– బాలప్ప, రైతు, చిల్మల్‌మైలారం

అన్ని విధాల మేలు



సేంద్రియ పద్ధతులతో భూమికి, మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు. భూసారం పెరుగుతుంది. ఆరోగ్యకర ఆహార ధాన్యాలు పండించవచ్చు. సేంద్రియ ఎరువులు వాడడం వల్ల భూమిలో సారవంతంతోపాటు లాభం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆరోగ్యమైన పంటను పండించవచ్చు. దీనిపై రైతులకు వివరిస్తున్నాం. రైతులు ఆసక్తి చూపాలి.

– రేణుక, ఏఈఓ, బొంరాస్‌పేట

విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందించాలి

వికారాబాద్‌ అర్బన్‌: భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తించి బలపర్చడమే జ్ఞానమని సంచార వర్గాల అభివృద్ధి, సంక్షేమ బోర్డు జాతీయ సభ్యుడు నరసింహ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంచార వర్గాల అభివృద్ధి సంక్షేమంపై విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో విభిన్న మతాలు, విభిన్న కులాల ప్రజలతో కూడుకొని ఉందని అందుకే సర్వేజనా సుఖినోభవంతు అంటూ ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. జాతీయ సమైక్యతను కాపాడే విధంగా విద్యా విధానం ఉండాలని, మానవుడిలోని అంతర్‌ జ్ఞానాన్ని వెలికి తీయడమే విద్య అని దీనిలో ఉపాధ్యాయులే ముఖ్య భూమిక పోషించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థం అయ్యేవిధంగా సులభతరంగా బోధించినట్లయితే బావి భారత పౌరులుగా తీర్చిదిద్దినవారమవుతామన్నారు. విద్యావ్యవస్థపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ భారతీయతను చాటే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అశోక్‌ కుమార్‌, డీఈఓ రేణుకాదేవి, డీఎస్‌సీడీఓ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి


ప్రచారం చేస్తున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు తదితరులు

దోమ: సమస్యలపై ప్రశ్నించే గొంతును శాసనమండలికి పంపించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కిష్టాపూర్‌, దిర్సంపల్లి, దాదాపూర్‌, మోత్కూర్‌, దోమ పాఠశాలలను వారు సందర్శించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎస్టీయూ అభ్యర్థి భుజంగరావు తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వానికి తెలిసేలా ఎస్టీయూ కృషి చేస్తోందని తెలిపారు. భుజంగరావును గెలిపించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు బసిరెడ్డి, షఫీ, కార్యదర్శి దయాకర్‌ తదితరులు పాల్గొన్నారు.